
వీ.ఎం.బంజర రింగ్ సెంటర్‌లో రోడ్ షోకు హాజరైన జనం

# తెలంగాణ ఆస్తిని కాపాడేది బీఆరెస్సే

- మీ బిడ్డగా అభిమానంతో కారు గుర్తుపై ఓటు వేయాలి
- కాంగ్రెస్‌కు చివరి వరకు అభ్యర్థి దొరకని పరిస్థితి
- వీ.ఎం.బంజర రింగ్ సెంటర్ రోడ్ షోలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు
- మోసం చేసింది కాంగ్రెస్ : రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు
- సమ న్యాయం చేసింది కేసీఆరే.. : సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర


మాట్లాడుతున్న వద్దిరాజు, పక్కన ఎంపీ అభ్యర్థి నామా, మాజీ ఎమ్మెల్యే సండ్ర

పెనుబల్లి, మే 8 : తెలంగాణ అస్తిత్వాన్ని, తెలంగాణ ఆస్తిని కాపాడేది బీఆర్ఎస్ ఎంపీలు మాత్రమేనని, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఖమ్మం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు అన్నారు. పెనుబల్లి మండల ప్రజలు ఆశీర్వదించి ఒకటో నెంబర్ కారు గుర్తుపై ఓటు గుద్దితే ఢిల్లీలో దద్దరిల్లాలని అన్నారు. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండల కేంద్రంలో బుధవారం రాత్రి నిర్వహించిన రోడ్ షోకు కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరోమారు మీ బిడ్డపై అభిమానం చూపి కారు గుర్తుపై ఓటు వేయాలని కోరారు. నేను స్థానికుడిని.. మీ బిడ్డను.. నన్ను బీఆర్ఎస్ అభ్యర్థిగా మన ప్రియతమ నేత కేసీఆర్ ముందుగానే ప్రకటించారని, కానీ.. కాంగ్రెసోళ్లు బయటి వ్యక్తిని తీసుకొచ్చి నామినేషన్ వేయించారని, వారికి అభ్యర్థులు దొరకని పరిస్థితి నెలకొందన్నారు. భవిష్యత్‌లో దేశ రాజకీయాల్లో తెలంగాణ ఎంపీలు కీలకమన్నారు. రెట్టించిన ఉత్సాహంతో ఈ నెల 13న ప్రతి ఒక్కరూ కారు గుర్తుపై ఓటు వేసేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

**మోసం చేసింది కాంగ్రెస్ : రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర**

అన్ని వర్గాలకు అండగా నిలిచింది గత కేసీఆర్ ప్రభుత్వమని, కానీ.. అధికారంలోకి రావడానికి కల్లబొల్లి మాటలు చెప్పి ప్రజలను మోసం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. రాబోయే రోజుల్లో కేసీఆర్ దేశ రాజకీయాల్లో చక్రం తిప్పుతారని, ఆయనకు అండగా నిలబడాలంటే ఈ నెల 13న జరిగే ఓటింగ్‌లో కారు గుర్తుపై ఓటు వేయాలని కోరారు.

**సమ న్యాయం చేసింది కేసీఆరే.. : మాజీ ఎమ్మెల్యే సండ్ర**

మాయమాటలు చెప్పి అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ పేద ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. బడుగు, బలహీన వర్గాలకు సమ న్యాయం చేసింది గత కేసీఆర్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన మంత్రులు లేకపోవడం శోచనీయమన్నారు. కాగా.. రోడ్ షోకు హాజరైన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కనగాల వెంకట్రావు, ఎంపీపీ లక్కినేని అలేఖ్య, జడ్పీటీసీ చెక్కిలాల మోహన్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ చెక్కిలాల లక్ష్మణరావు, నాయకులు కోటగిరి సుధాకర్ బాబు, లక్కినేని వినీల్, మండల ప్రధాన కార్యదర్శి భూక్యా ప్రసాద్, వంగా గిరిజాపతి, పసుమర్తి వెంకటేశ్వరరావు, చిలకా నీలాద్రిబాబు, దొడ్డపునేని రవి, మందడపు అశోక్‌కుమార్, ఎలమర్తి శ్రీను, తేళ్లూరి నాగేశ్వరరావు, తేజావత్ తావునాయక్, కాకా సీతారాములు, కొత్తగుండ్ల అప్పారావు, తడికమల్ల తాతారావు, మాగం రాఘవరావు, చింతనిప్పు సత్యనారాయణ, తాళ్లూరి శేఖర్‌రావు, నరుకుళ్ల సత్యనారాయణ, ఆవిటి మారేశ్వరరావు, మాగళ్ల నాగేశ్వరరావు, లగడపాటి శ్రీను, గోదా చెన్నారావు, ఏటుకూరి వెంకట అప్పారావు, సత్యనారాయణ, పరిమి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో బీఆర్ఎస్‌దే గెలుపు

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచేది బీఆర్ఎస్ పార్టీయే**

- కేసీఆర్ చెప్పినట్లుగానే కేంద్రంలో వచ్చేది సంకీర్ణ ప్రభుత్వమే
- కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటులో ప్రాంతీయ పార్టీలదే కీలక పాత్ర
- హామీలు నెరవేర్చకుండా ఓట్లడిగే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదు
- 'నమస్తే తెలంగాణ'తో బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు




ఖమ్మం, మే 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గంలో గెలిచేది బీఆర్ఎస్ పార్టీయేనని ఆ పార్టీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచగలిగే శక్తి కేవలం బీఆర్ఎస్‌కే ఉందన్న విషయాన్ని ప్రజలు గుర్తించారని అన్నారు. అందుకే ఈ స్థానంలో తన గెలుపు ఖాయమని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ తరఫున మరోసారి ఖమ్మం ఎంపీగా పోటీచేస్తున్న ఆయన.. బుధవారం 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు. లోక్‌సభ సభ్యుడిగా తెలంగాణ అభివృద్ధికి కేంద్రం నుంచి రావాల్సిన నిధుల కోసం కేంద్ర ప్రభుత్వంతో రాజీలేని పోరాటం చేశానని గుర్తుచేశారు. గత పార్లమెంటు ఎన్నికల్లో తాను ఎంపీగా గెలిచి జాతీయ రహదారుల కోసం కేంద్రంతో పోరాడానని, జిల్లాకు వాటిని తీసుకొచ్చానని వివరించారు. జిల్లా అభివృద్ధి కోసం అహర్నిశలూ శ్రమించానని అన్నారు. అందుకే ఈ ఎన్నికల్లో తన గెలుపును ఎవ్వరూ ఆపలేరని స్పష్టం చేశారు.

### రాష్ట్ర ప్రజలను కాంగ్రెస్ మోసం చేసింది..

తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలనూ కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని నామా విమర్శించారు. ముఖ్యంగా మహిళలను, రైతులను వంచించిందని ఆరోపించారు. అలవికాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. మహిళలను, రైతులను, కౌలు రైతులను మభ్యపెట్టిందని దుయ్యబట్టారు. ఇప్పుడు హామీలను అమలుచేయలేక చేతులెత్తేయడంతో ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని విమర్శించారు. గత పదేళ్లలో ఎన్నడూలేని విధంగా తాగు, సాగునీటి కష్టాలు మొదలయ్యాయని అన్నారు.

### కేసీఆర్ రోడ్‌షోకి అనూహ్య స్పందన

గత వారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జరిగిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బస్సుయాత్ర, రోడ్‌షోకు అనూహ్య స్పందన లభించిందని బీఆర్ఎస్ అభ్యర్థి నామా పేర్కొన్నారు. వాటికి హాజరైన అశేష ప్రజావాహినే అందుకు నిదర్శనమని స్పష్టం చేశారు. అలాగే, మహాలక్ష్మి గ్యారెంటీలో భాగంగా ప్రతి మహిళకూ రూ.2,500 ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఐదు నెలలుగా ప్రతి మహిళకూ రూ.12,500 బాకీ పడిందని అన్నారు. వాటిని అందించాకే కాంగ్రెస్ పాలకులు, నేతలు ప్రజల్లోకి వెళ్లాలని డిమాండ్ చేశారు. హామీలు నెరవేర్చకుండా ఓట్లడిగే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదని స్పష్టం చేశారు. కర్షకులపై కాంగ్రెస్‌కు ఏమీ ప్రేమలేదని, అందుకే జిల్లాలో ఒక్క తడికి కూడా సక్రమంగా సాగునీళ్లు ఇవ్వలేదని విమర్శించారు. ఈ ప్రభుత్వ అసమర్థతకు ఇలాంటివి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయని చెప్పారు.

### పార్లమెంటులో తెలంగాణ గొంతుక వినిపించా..

రాష్ట్ర ప్రజల సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించింది, తెలంగాణ గొంతుక వినిపించింది తానేనని నామా నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో మరోసారి తనను గెలిపిస్తే పెండింగ్ సమస్యలపైనా, తెలంగాణకు రావాల్సిన నిధులపైనా గళమెత్తుతానని మాట ఇచ్చారు. గత లోక్‌సభలో తెలంగాణ రైతుల సమస్యలపై బీఆర్ఎస్ ఎంపీలం తప్ప.. కాంగ్రెస్, బీజేపీల ఎంపీలు ఒక్కసారి కూడా మాట్లాడలేదని గుర్తుచేశారు. తమతో కలిసిరావాలని కోరినా వారు పట్టించుకోలేదని విమర్శించారు. అందుకే తెలంగాణ ఆత్మగౌరవం బీఆర్ఎస్‌తోనే సాధ్యమని స్పష్టం చేశారు.

### హామీలపై మెడలు వంచుతాం..

గ్యారెంటీ హామీలపై రాష్ట్ర ప్రభుత్వంపైనా, తెలంగాణపై వివక్షపై కేంద్ర ప్రభుత్వంపైనా పోరాడి వాటి మెడలు వంచేది బీఆర్ఎస్ మాత్రమేనని నామా తేల్చిచెప్పారు. కాంగ్రెస్ చెప్పిన కౌలు రైతులకు రూ.15 వేలు, వరి పంటకు రూ.500 బోనస్, కల్యాణలక్ష్మితోపాటు తులం బంగారం వంటి హామీలన్నీ తుస్సుమన్నామని విమర్శించారు. తనకు లభించిన ప్రతి అవకాశాన్నీ ఖమ్మం జిల్లా పురోభివృద్ధికి వినియోగించానని, ఖమ్మం అభివృద్ధిలో తనవంతు పాత్ర పోషించానని వివరించారు.

### మున్ముందు ప్రాంతీయ పార్టీలదే హవా..

రానున్న రోజుల్లో దేశంలో ప్రాంతీయ పార్టీల హవానే కొనసాగుతుందని బీఆర్ఎస్ అభ్యర్థి స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు పూర్తి మెజార్టీ వచ్చే అవకాశంలేదని అన్నారు. తమ పార్టీ అధినేత కేసీఆర్ విశ్లేషించినట్లు దేశంలో ఏర్పడేది సంకీర్ణ ప్రభుత్వమేనని, అందులో ప్రాంతీయ పార్టీల మద్దతు కీలకమని అన్నారు. తనను మళ్లీ గెలిపిస్తే బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేటలో రైల్వేకోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు కృషిచేస్తానని అన్నారు. తాను రైతు పక్షపాతినని, నష్టాల్లో ఉన్న పాలేరు చక్కెర కర్మాగారాన్ని కొనుగోలు చేసి రైతుల కోసం 22 ఏళ్లుగా నడిపిస్తున్నానని వివరించారు.

# మోసపూరిత వాగ్దానాలే చెంపపెట్టు కావాలి

- గ్యారెంటీలు అమలుచేయని కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి
- ఇందుకోసం కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలి
- ఖమ్మంలో ఇంటింటి ప్రచారంలో మాజీ మంత్రి అజయ్‌కుమార్


ఖమ్మంలోని 23వ డివిజన్ ముస్తాఫానగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం, మే 8: అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన మోసపూరిత వాగ్దానాలే పార్లమెంటు ఎన్నికల్లో ఆ ప్రభుత్వానికి చెంపపెట్టు కావాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ విమర్శించారు. గ్యారెంటీ హామీలను అమలుచేయని ఆ ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ ఖమ్మంలోని 23వ డివిజన్ ముస్తాఫానగర్‌లో శ్రేణులతో బుధవారం ఆయన విస్తృత ప్రచారం నిర్వహించారు. నమూనా బ్యాలెట్ చూపిస్తూ, కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ గెలవడం ద్వారా కాంగ్రెస్ మెడలు వంచి గ్యారెంటీ హామీలను అమలు చేయించుకునే అవకాశం కలుగుతుందని అన్నారు. గడిచిన పదేళ్లలో ఖమ్మం నగరంలో ఏ వేసవిలోనూ తాగునీటి ఇబ్బందులు తలెత్తలేదని గుర్తుచేశారు. కానీ కాంగ్రెస్ వచ్చిన కొద్ది కాలంలోనే నగరవాసులు తాగునీటి కోసం తంటాలు పడుతున్నారని అన్నారు. ఇది కచ్చితంగా ప్రభుత్వ వైఫల్యమే అవుతుందని స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఉద్దేశించి ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు హుందాతనంగా లేవని అన్నారు. కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు మక్బూల్, కర్నాటి కృష్ణ, ఇలియాస్, సలీం, జామల్, లాలా, ఝాన్సీ, శ్రీను, తాహేర్, కరీముల్లా, మునాఫ్, అజ్జు, శ్రావణి, విమల తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ అంటేనే భరోసా

- పార్లమెంటు ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించాలి
- భారీ మెజార్టీతో పార్టీకి పూర్వ వైభవం తేవాలి
- ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే కందాల


ఖమ్మం రూరల్లో కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్న పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల

ఖమ్మం రూరల్, మే 8: బీఆర్ఎస్ అంటేనే యావత్ తెలంగాణ ప్రజలకు భరోసా అని పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. నామా నాగేశ్వరరావు అంటే ఇక్కడి ప్రజలకు ఎంతో నమ్మకమని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ ఖమ్మం రూరల్ మండలంలో మంగళవారం రాత్రి విస్తృత ప్రచారం నిర్వహించిన ఆయన.. ఆరెంపుల, కొండాపురం, చింతపల్లి, తల్లంపాడు, పొన్నెకల్, మద్దులపల్లి గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. అనంతరం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, జడ్పీటీసీ యండపల్లి వరప్రసాద్‌తో కలిసి ఆయా గ్రామ కమిటీల బాధ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆది నుంచి బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే వెన్నుముక అని, ప్రతి ఎన్నికల విజయంలోనూ వారిదే ముఖ్య భూమిక అని గుర్తుచేశారు. అదే విధంగా ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావుకు పాలేరు అసెంబ్లీ నియోజకవర్గంలో అధిక మెజార్టీ అందించాలని, ప్రభంజనం సృష్టించి పార్టీకి పూర్వ వైభవం తేవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని అన్నారు. పార్టీ నాయకులు జీవన్‌కుమార్, గూడ సంజీవరెడ్డి, అక్కినపల్లి వెంకన్న, బండి సతీశ్, ముత్యం కృష్ణారావు, ఆనంద్, సుదర్శన్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# అస్తవ్యస్తంగా కాంగ్రెస్ పాలన

- పథకాలు అందక ప్రజలు సతమతం
- కారు గుర్తుకు ఓటేసి కవితను గెలిపించాలని అభ్యర్థన
- ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్


పోలారంలో ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్

ఇల్లెందు రూరల్, మే 8 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన అస్తవ్యస్తంగా తయారైందని, ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో ప్రజలు కాంగ్రెస్ తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియానాయక్ అన్నారు. బుధవారం పోలారం పంచాయతీ పరిధిలో మహబూబాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా మాలోతు కవితను గెలిపించాలని కోరుతూ ఆమె ముమ్మర ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలన్నీ ప్రజల దరికి చేరడంతో సుఖసంతోషాలతో జీవించారన్నారు. రైతుబంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, బాలింతలకు కేసీఆర్ కిట్, పంట పెట్టుబడి సాయం తదితర పథకాలు కేసీఆర్ ప్రభుత్వం అందిస్తే.. ఇప్పుడు కాంగ్రెస్ వాటిని అమలు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. పంటలు పండించుకోవాలంటే పూర్తిస్థాయిలో వ్యవసాయానికి కరెంటు ఇవ్వకపోవడంతో రైతులు సతమతమవుతున్నారన్నారు. ప్రస్తుతం ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం ప్రచారం చేస్తుంటే.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉంటేనే బాగుండేదని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని అన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి ఎంపీగా కవితను గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో నాయకులు అజ్మీరా కవిత, మల్సూర్, బాలు, రాములు, లక్ష్మయ్య, నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

# వద్దిరాజు ఇంటింటి ప్రచారం

**ఎంపీగా నామాను గెలిపించాలని అభ్యర్థన**


ఇంటింటి ప్రచారం చేస్తున్న వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం, మే 8 : అమలుకు నోచుకోని హామీలు ఇచ్చి ఇప్పుడు వాటి ఊసెత్తని కాంగ్రెస్ పాలకులకు పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. ఖమ్మం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు గెలుపును కాంక్షిస్తూ బుధవారం నగరంలోని బురహాన్‌పురంలో వద్దిరాజు విస్తృతంగా ప్రచారం చేశారు. వాడవాడలా.. గడపగడపకూ కలియతిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేస్తూ కారు గుర్తుకు ఓటు వేసి నామాను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై ప్రజలు చాలా కోపంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ వచ్చింది కరెంట్ పోయింది.. తాగేందుకు నీళ్లు కూడా దొరకని పరిస్థితి ఏర్పడిందని ఈసడించుకుంటున్నారని అన్నారు. ఇచ్చిన హామీలన్నీ మరిచిపోయారని, కనీసం సీఎంఆర్ఎఫ్, ఎల్వోసీల మాటే లేదన్నారు. ఇంటింటా ప్రచారానికి అనూహ్య స్పందన వచ్చిందన్నారు. జిల్లా ప్రజలు చైతన్యవంతులని, ఇక్కడ నామా నాగేశ్వరరావు, మహబూబాబాద్‌లో మాలోతు కవిత ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శీలంశెట్టి వీరభద్రం, పొన్నం వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు శీలంశెట్టి రమాదేవి, బుర్రి వెంకట్ పాల్గొన్నారు.

### ఇస్త్రీ చేస్తూ.. ఓట్లు అడుగుతూ..

బురహాన్‌పురంలో ప్రచారంలో భాగంగా రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు ఇస్త్రీ షాపును సందర్శించారు. కొద్దిసేపు బట్టలు ఇస్త్రీ చేసి కేసీఆర్ నాయకత్వానికి సంపూర్ణ మద్దతునివ్వాలని షాపు యజమాని వెంకన్నను కోరగా.. ఆయన సానుకూలంగా స్పందించాడు.

# ఎమ్మెల్సీకి ఆరో రోజు 19 మంది నామినేషన్

**నేడు నామినేషన్లకు చివరి రోజు**

నల్లగొండ, మే 8 : వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గం శాసనమండలి ఉప ఎన్నికలో భాగంగా బుధవారం ఆరో రోజు 19 మంది అభ్యర్థులు 21 సెట్ల నామినేషన్లు వేశారు. ధర్మసమాజ్ పార్టీ నుంచి బరిగెల దుర్గాప్రసాద్ మహారాజ్ ఒక సెట్, విద్యార్థుల రాజకీయ పార్టీ నుంచి పాలకూరి అశోక్‌కుమార్ ఒక సెట్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న ఒక సెట్, గోండ్వానా దండకారణ్య పార్టీ నుంచి సోడె వెంకటేశ్వర్లు ఒక సెట్, బీఆర్ఎస్ పార్టీ నుంచి ఏనుగుల రాకేశ్ ఒక సెట్, సోషల్ జస్టిస్ పార్టీ నుంచి చెన్నా శ్రీకాంత్ 2 సెట్లు, తెలంగాణ రిపబ్లికన్ పార్టీ నుంచి గుండాల జ్యోతి ఒక సెట్, బీజేపీ నుంచి కేదారి మేకల ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా పోతుల ప్రార్థన రెండు సెట్లు, గంగిరెడ్డి కోటిరెడ్డి ఒక సెట్, తేజావత్ వాసుదేవ ఒక సెట్, భైరవభట్ల శ్రీనివాసరావు ఒక సెట్, యాతాకుల శేఖర్ ఒక సెట్, దునుకుల వేలాద్రి ఒక సెట్, గుగులోతు సంతోష్ ఒక సెట్, రత్నం ప్రవీణ్ ఒక సెట్, జన్ను భరత్ ఒక సెట్, గుగులోతు రాజునాయక్ ఒక సెట్, పట్టం మల్లికార్జున ఒక సెట్ నామినేషన్లను అందించారు. నామినేషన్ పత్రాలను నల్లగొండ కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో వరంగల్-ఖమ్మం-నల్లగొండ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ దాసరి హరిచందనకు సమర్పించారు. గురువారం వరకు నామినేషన్ల స్వీకరణ జరుగనుండగా, 10న స్క్రూటినీ, 13న నామినేషన్ల ఉపసంహరణ, అదే రోజు అభ్యర్థుల జాబితా, గుర్తుల కేటాయింపు చేయనున్నారు. ఈ నెల 27న పోలింగ్ నిర్వహించి వచ్చే నెల 5న ఫలితాలు వెల్లడించనున్నారు.

# ఓటు వేసి ఆశీర్వదించండి

- మళ్లీ గెలిపిస్తే అభివృద్ధిలో ముందుంచుతా..
- ప్రజా సమస్యలపై పార్లమెంట్‌లో ప్రశ్నిస్తా..
- ముఖ్య కార్యకర్తల సమావేశంలో మహబూబాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత
- కవితను మరోసారి గెలిపించండి : మాజీ మంత్రి సత్యవతి రాథోడ్
- కేసీఆర్ బస్సు యాత్రతో కాంగ్రెస్ గుండెల్లో రైళ్లు : బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా


సమావేశంలో మాట్లాడుతున్న మహబూబాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత. పక్కన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

సారపాక, మే 8 : కేసీఆర్ సారథ్యంలో మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చి అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, మళ్లీ ఎంపీగా పోటీ చేస్తున్న తనకు ఓటు వేసి ఆశీర్వదించాలని మహబూబాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత కోరారు. మండలంలోని మోరంపల్లి బంజర్‌లో సీనియర్ నాయకుడు మేడం లక్ష్మీనారాయణరెడ్డి నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుతోపాటు కవిత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత ఎన్నికల్లో తనను గెలిపిస్తే మరిన్ని నిధులు తీసుకొచ్చి అభివృద్ధిలో నియోజకవర్గాన్ని ముందుంచుతానన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పార్లమెంట్‌లో ప్రస్తావించి.. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని, కారు గుర్తుకు ఓటు వేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కవిత కోరారు.

### కవితను మరోసారి గెలిపించండి : మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

ప్రజా సమస్యలపై పార్లమెంట్‌లో గొంతెత్తి ప్రశ్నించే ఎంపీ అభ్యర్థి మాలోతు కవితను మరోమారు గెలిపించాలని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ కోరారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో పోడు భూములకు పట్టాలివ్వగా.. అత్యధికంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతులకే వీటిని అందించామన్నారు. నియోజకవర్గంలో పనిచేసే నాయకుడు రేగా అని, ఆయన ఈ ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. ఎంపీగా కవితను గెలిపిస్తే ఈ ప్రాంత ప్రజలకు అండగా నిలవడంతోపాటు మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు.

### కేసీఆర్ బస్సు యాత్రతో గుండెల్లో రైళ్లు : బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్రతో కాంగ్రెస్ నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని, కేసీఆర్ దెబ్బకు ప్రభుత్వం వెంటనే రైతుల ఖాతాల్లో రైతుబంధు జమ చేస్తోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలైనా వారు చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. కాంగ్రెస్‌పై కోపంతో ఉన్న రైతులు, ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులకు అత్యధిక మెజార్టీ ఇచ్చేలా ముందుకు సాగుతున్నారన్నారు. సమావేశంలో జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, సొసైటీ అధ్యక్షుడు బిక్కసాని శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి, మాజీ ఎంపీటీసీ తోటమల్ల సరిత, గ్రామ శాఖ అధ్యక్షుడు ఖగేందర్‌రెడ్డి, మండల నాయకులు పొడియం నరేందర్, కొనకంచి శ్రీనివాసరావు, బెజ్జంకి కనకాచారి, గోనెల నాని, చల్లకోటి పూర్ణ, చుక్కపల్లి బాలాజీ, బిట్రా సాయిబాబా, బికారి, వలదాసు సాలయ్య, సాధిక్ పాషా, రవికుమార్, మాజీ సర్పంచ్‌లు కొర్సా వెంకన్న, కుంజా చిన్నబ్బాయి, బానోతు శ్రీను, భూక్యా సీతారాములు తదితరులు పాల్గొన్నారు.